- సిరిసిల్ల ప్రజలే నాకు అండ
- మీరే నన్ను కాపాడుకుంటరు
- నాకు ఏ భయం లేదు
- అందుకే నేను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బయట తిరుగుతున్న
- కండ్ల ముందే అభివృద్ధి ఉన్నది
- ఎన్నికలు రాగానే ఆగం కావద్దు
- సిరిసిల్ల నుంచే జైత్రయాత్ర మొదలు పెడుదాం
- సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే అభ్యర్థి కేటీఆర్
- తెలంగాణభవన్‌లో 'వోట్ ఫర్ కార్' టెక్‌సెల్ ప్రారంభం

# నా ధైర్యం మీరే



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో పలువురు నాయకుల చేరిక అనంతరం మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్ 6: 'గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచింది. ఈ అభివృద్ధి మున్ముందు కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలి. అందుకే నేను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర మంతటా తిరుగుతున్న. నా ధైర్యం ఏంటంటే ఇక్కడి ప్రజలే. మీరే నా అండ. మీరే నా భరోసా. మీరే నన్ను కాపాడుకుంటరు. ఇక్కడి నాయకులతోపాటు మీ అందరిపైనా నాకు నమ్మకం ఉన్నది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కేటీఆర్ సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికలు రాగానే ఆగం కావద్దని, ఇతర పార్టీల నాయకుల చిల్లర మాటలకు లొంగిపోతే మోసపోతామని హెచ్చరించారు. మన బతుకులు బాగు చేసిన కేసీఆర్ మన ముందర ఉన్నారని, ఆయనను మూడోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని సుమారు వెయ్యి మంది వివిధ పార్టీలు, యువజన, కుల సంఘాల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి మీ కండ్లముందే కనిపిస్తున్నదని చెప్పారు. ఎటు చూసినా పచ్చదనం, తాగునీరు, సాగునీరు, సమృద్ధిగా కరెంట్ అందిస్తున్నామన్నారు. ఒకప్పుడు మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల, ఇప్పుడు సుభిక్షంగా ఉందన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందడంతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పాలనలో కులాల పేరున కుంపట్లు, మతం పేరిట మంటలు, ప్రాంతం పేరిట పంచాయితీలు పెట్టలేదన్నారు. చాలామంది చాలారకాల మాటల దాడులు చేస్తున్నారని, అన్నింటినీ మీరు గ్రహిస్తున్నారన్నారు. సిరిసిల్లలోనూ రకరకాల ప్రయోగాలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలో నాయకత్వాన్ని చూస్తే ఎవరికైనా భయం కలుగుతుందన్నారు. ఇంత కష్టపడి తెచ్చుకున్న రాష్ట్రం, చేసుకున్న అభివృద్ధిని దాచిదాచి దయ్యాల పాలు చేస్తామా..? అనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. కేసీఆర్ వంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన టెక్ సెల్(సమాచారం కేంద్రం) కార్యాలయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్‌సెల్ విభాగంలోని సిబ్బందితో కేటీఆర్ మాట్లాడి సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు దరువు ఎల్లన్న, బొల్లి రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### మన బతుకులు బాగు చేసిన కేసీఆర్‌ను మరవద్దు

'కాంగ్రెస్‌లో ప్యారాచూట్, హెలీక్యాప్టర్ నాయకులను దింపుతురట. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బయటివాళ్లను తీసుకొస్తడట' అని ఓ మిత్రుడు అడిగిండు. ఈ ప్రశ్నకు నేను ఒకటే మాట చెప్పిన. నా సిరిసిల్ల అన్నాతమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లకు ఏది మంచో.. ఏది చెడో తెలుసు. వాళ్లే నన్ను కాపాడుకుంటరని ధైర్యంగా అన్న. సిరిసిల్ల ఎట్ల మారిందో మీకే కనపడుతున్నది. ఎవరి వల్ల ఇదంతా సాధ్యమైందో నా కంటే మీకే ఎక్కువ తెలుసు. మన బతుకులు బాగు చేసిన, కరెంటు బాగు చేసిన, సాగునీరు, తాగునీరు ఇచ్చిన, మన వ్యవసాయాన్ని బాగుచేసిన కేసీఆర్‌ను మరిచిపోవద్దు. మరెవరో గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.

- మంత్రి కేటీఆర్

### సిరిసిల్ల నుంచే జైతయాత్ర మొదలు పెడుదాం

నారాజు అయినా మనోళ్ల మీదనే చూపిస్తం. మనోళ్లు అనుకున్నప్పుడే అలుగుతం. గులుగుతం. కానీ, అలిగినా.. గులిగినా గులుగుడు గులుగుడే. మళ్ల ఓట్లప్పుడు కేసీఆర్‌కు గుద్దుడు గుద్దుడే. అందులో ఏ మాత్రం తేడారాదు. మా వోళ్లు కాబట్టే మా కేసీఆర్ అనుకొని అలుగుతున్నరు. ఆఖరికి కేసీఆర్ అయితేనే కరెక్టు అని, ఎవరిచేతిలో పెట్టినా రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరాకు అవుతుందనే విషయం మీ అందరికి తెలుసు. ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. నిన్ననే విరాట్ కోహ్లి సెంచరీకొట్టి సచిన్ రికార్డును సమం చేసిండు. మనం కూడా సెంచరీ కొడుదాం. సిరిసిల్ల నుంచే జైత్రయాత్ర మొదలు పెడుదాం. రాష్ట్రంలో వంద సీట్లు దాటుదాం. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం.

- మంత్రి కేటీఆర్



జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో టెక్‌సెల్ కార్యాలయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ప్రారంభిస్తున్న అమాత్యుడు కేటీఆర్



వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాముకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

# 'ముంపు' సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- కొడుముంజ, చింతల్‌ఠాణా, శాభాష్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



కొడుముంజలో ఎన్నికల ప్రచారంలో భాగంగా డోలు కొడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, నవంబర్ 6: ముంపు గ్రామాల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని, గెలిచిన ఆరు నెలల్లో అన్నింటినీ పరిష్కరిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన వేములవాడ మండలం చింతల్‌ఠాణా, కొడుముంజ, శాభాష్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఏండ్లు గడుస్తున్నా.. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకపోవడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నిర్వాసితులకు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు మంత్రి కేటిఆర్ కృషి చేస్తున్నారని, ఇప్పటికే అమెరికా కంపెనీతో ఒప్పందం చేసుకొని ₹600కోట్లతో చేపల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమైనట్లు చెప్పారు. ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే సుమారు 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం ముంపు గ్రామాల సమస్యలను చాలా వరకు పరిష్కరించిందని, కారు గుర్తుకు ఓటేసి మరో అవకాశం ఇస్తే.. రాబోయే రోజుల్లోనూ మిగిలిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకుముందు ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వెళ్లిన చల్మెడకు గ్రామస్తులు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. శాభాష్‌పల్లిలో భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ, వైస్ ఎంపీపీ ఆర్‌సీరావు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, సర్పంచ్ రేగులపాటి రాణి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణదేవరావు, నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

### నామినేషన్ ఖర్చు కోసం రూ.25వేలు అందజేత

చింతల్‌ఠాణాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రేగులపాటి వెంకట్‌రావు, రేగులపాటి శంకర్‌రావు, గుర్రం మల్లారెడ్డి, పర్వతి మహేశ్, బొప్ప శ్రీనివాస్ చల్మెడ నరసింహారావుకు నామినేషన్ ఖర్చుల కోసం ₹25వేలు అందించారు.



చింతల్‌ఠాణాలో వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనరసింహారావుకు నామినేషన్ ఖర్చు కోసం రూ.25వేలు అందిస్తున్న నాయకులు



బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు